# భార్యకోసం



**- కె. ఎస్. ప్రసాద్**

కృష్ణమూర్తి ఆత్మహత్య చేసుకోవాలనే నిశ్చయానికి వచ్చేశాడు. ఇక తను బ్రతకలేడు. విరక్తి పుట్టేసింది. మృత్యుగహ్వరంలోని ప్రశాంతతపై మమకారాన్ని పెంచుకున్నాడు.

ఏమని బ్రతుకుతాడు? ఎవరి కోసం బ్రతుకుతాడు? ఎందుకని బ్రతుకుతాడు?

తన ఉద్యోగం అన్యాయంగా పోయింది. తన కొడుకు— తన గారాలపట్టి— ఒక నాటి రాత్రి ఈ ప్రపంచం నుండి అంతర్థానమై పోయాడు. తన భార్యను పీడించిన రోగం నయం చేయడానికి డాక్టర్‌కు ఫీజు, మందులకు డబ్బు లేకపోవడం వలన రోగమే ఆమెను హరించేసింది.

ఇంకెందుకు తనకు జీవితం? ఈ దారిద్ర్యంలో మగ్గిపోలేడు. చావే శరణ్యం!

ఆ రోజు రాత్రి ఆలోచించాడు. ఎలాగ చనిపోవాలి? ఏది ఉత్తమమయిన మార్గం? తనకు ఎక్కువ బాధ కలగకుండా, సులువుగా తన ప్రాణం తన దేహంనుండి వేరవాలి.

రాత్రి పన్నెండు గంట లయింది. 'నువ్వు తొందరగా చచ్చిపో! నేను ప్రశాంతంగా నిద్ర పోతాను' అన్నట్లుగా వాతావరణం స్తబ్దంగా ఉంది. వెన్నెముకలోనుంచి చలి పుట్టుకు వస్తూంది. స్టేషనులో రైలు కూత కూసి, ఆనందంగా ఆ ఊరుని వదిలేసింది.

కృష్ణమూర్తి ఆఖరి సిగరెట్టు కేసి దీనంగా చూశాడు. ఇక సిగరెట్లు లేవు. తాగడానికి తన జీవితంకూడా ఉండదు. సిగరెట్ వెలిగించి గట్టిగా దమ్ము లాగి వదిలాడు. ప్రతిఫలంగా సిగరెట్ అతడికొక ఐడియా ఇచ్చింది. రైలుకింద తల పెడితే సరిపోతుంది. ఒక సెకనులో పని అయిపోతుంది.

రైలుపట్టాల మధ్య నించుని సిగ్నల్ పోల్ కేసి చూశాడు. ఏదో రైలు వస్తున్నట్లుంది. సిగ్నల్ ఇచ్చారు. రైలు వచ్చేస్తూంది. ఆవురావురు మంటూ కాలం నిమిషాలను మింగేస్తూంది. కృష్ణమూర్తి ఊహల్లోని ఆశాసౌధం రైలు రూపంలో పరుగెత్తుకుంటూ వచ్చేస్తూంది. కృష్ణమూర్తి రైల్వే లైన్ల మీద పడుకున్నాడు, నక్షత్రాలను లెక్కిస్తూ

ఉన్న వీడికి ఇంత ధైర్యం ఎక్కడినుంచి వచ్చిందో' అని ఆశ్చర్యపడ్డారు.

కృష్ణమూర్తికి డిఫెన్సు లేదు. మొత్తం అంతా అతనికి వ్యతిరేకమే! కృష్ణమూర్తి మీద పబ్లిక్ ప్రాసిక్యూటర్ చాలా నేరాలు మోపాడు. సాక్షులు చాలా మంది సాక్ష్యం చెప్పారు. డాక్టర్లు, పోలీసులు, ఇంకా చాలా మందిని విచారించారు.

కృష్ణమూర్తి బోనులో నిలబడ్డాడు. కృష్ణమూర్తిని జడ్జి అడిగారు: 'నీవే హత్య చేశావని ఒప్పుకుంటున్నావా?'

'ఒప్పుకుంటున్నాను.' కృష్ణమూర్తి సమాధానం.

'హత్య ఎందుకు చేశావ్?'

'చాలా కాలంగా నాకు చనిపోవాలని ఉంది. అయితే మూడు సార్లు ఆత్మహత్య చేసుకోడానికి ప్రయత్నించి మూడుసార్లు ఇన్స్పెక్టర్ చేతిలో పడ్డాను. అతను నన్ను న్యాయంగా హింసించాడు. అమానుషంగా ప్రవర్తించాడు. ఆ క్రూరత్వాన్ని సహించలేకపోయాను. నేను బతుకుతున్నాను. నాకు కావలసింది మృత్యువు. కానీ, అమానుషమైన ఒక ఇన్స్పెక్టర్ చేతిలో మరణం కాదు. మీ న్యాయస్థానం నన్ను ఉరితీస్తే హాయిగా చచ్చిపోతాను. మీ న్యాయం నాకు మరణం ప్రసాదించాలంటే, మీకు తెలుసుగా — నేను మరొకరి ప్రాణాలు బలి తీసుకోవాలి. ఇన్స్పెక్టర్ ప్రాణం తీసుకోదల్చుకున్నాను." ముగించాడు.

అంతా ఆశ్చర్యపోయారు. 'వీడి కెంత పొగరు' అనుకున్నారు కోర్టు హాల్లో. కలవరంకూడా ప్రారంభమయింది. 'నిండు బోనులో కొరుకుతున్నట్లు అతనికి మరణ శిక్ష విధిస్తే శిక్ష అనే దానికి అర్థమేముంది?' అనుకున్నారు ఆ మాటలు జడ్జిగారి చెవిని కూడా పడ్డాయి.

"ఆర్డర్! ఆర్డర్!" అని అరిచి, కృష్ణమూర్తిని జడ్జిగారు అడిగారు "నువ్వు ఇన్స్పెక్టర్ను హత్య చేయక ముందు ఆత్మహత్యకు ప్రయత్నించావా?"

"మూడు సార్లు ప్రయత్నించాను"

"ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డావు?"

కృష్ణమూర్తి కోర్టు హాలంతా చూశాడు. అంతా అతనివేసి చూస్తున్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అతన్ని తినేలాగా చూస్తున్నాడు

"ఈ ప్రశ్న చాలా తెలివి తక్కువ ప్రశ్నలా అనిపిస్తోంది నాకు ఎవరయినా ఎందుకని తన్ను తాను చంపుకుంటాడు? చావుమీద ఇష్టమున్న కోరికతో మాత్రం కాదు. బ్రతుకులో తీపి లేక. బ్రతుకుమీద రోత పుట్టి. నాపై ఆధారపడ్డ నా భార్య, నా కొడుకు నన్ను ఒంటరిగా, దిక్కులేకుండా వదిలిపోయారు. కోర్టువారి దృష్టిలో ఆ రెండూ సహజ మరణాలు. నా దృష్టిలో సంఘంచేత క్రూరంగా హత్యచేయబడినారు. నాకు బ్రతకడానికి తగిన ఆధారం లేదు. నాకు చేయూతనిచ్చి బ్రతుకుపై ఆశ కల్పించే వాళ్ళు ఎవరూ లేరు. ప్రతి రోజూ, ప్రతి నిమిషం, ప్రతి క్షణంకూడా భయమే! రోజు గడవాలంటే ఎవరో ఒకర్ని ముష్టి ఎత్తాలి. అలాగే చేశాను కొంతకాలంపాటు. ఇంక చెయ్యలేకపోయాను" కృష్ణమూర్తి కళ్ళలో అశ్రువులు నిండాయి.

"జడ్జిగారూ! నేను చాలా పెద్ద అపరాధం చేశాను. క్షమించరాని హత్య చేశాను, నాకు తెలుసు కోర్టువారి దృష్టిలో దీనికి మరణమే శిక్ష. నన్నింక ఎక్కువ ప్రశ్నలు అడగకండి. నేనేం సమాధానం చెబుతానో, నేనేం చేస్తానో నాకే తెలియదు. ఒకటి మాత్రం నాకు బాగా తెలుసు. మీరు చాలా మంచివారని ప్రసిద్ధికెక్కారు. న్యాయ ధర్మాల విషయంలో చాలా నిక్కచ్చి మనుషులని విన్నాను. నేనే మీ స్థానంలో ఉన్నా నా లాంటి వాడికి మరణ దండనే విధిస్తాను. ఎక్కువగా ఆలోచించి మీ మెదడు పాడుచేసుకోకండి. నేనెక్కువగా మాట్లాడుతున్నానని అపార్థం చేసుకోకండి మీ ధర్మాన్ని మీరు నిర్వర్తించండి ఇటు చూడండి — మీ తీర్పు కోసం ఎంతమంది చూస్తున్నారో. వాళ్ళంతా మీరు నాకు మరణ దండన విధిస్తే తృప్తిగా వెళ్ళిపోతారు. వారికి కావలసినది నా లాంటి వాడు ఈ లోకంలో ఉండకూడదన్నదే. వాళ్ళ తృప్తి కోసం, చనిపోయిన ఇన్స్పెక్టర్‌గారి భార్యాబిడ్డల తృప్తి కోసం, నా కేసి కోపంగా చూస్తున్న ఆ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తృప్తి కోసం, నాకోసం — నాకు మరణ దండన విధించండి మీ కడుపున పుడతాను" అని ముగించాడు.

ఆఖరి వాక్యం జడ్జిగారిలో ఉద్వేగాన్ని రేకెత్తించింది. 'వీడు వచ్చి నా కడుపున పుట్టడమేమిటో' అని జడ్జిగారి ఒళ్ళు జలదరించింది.

తీర్పు రెండు రోజులకు వాయిదా పడింది. ప్రజలు చాలా అసంతృప్తులుగా వెళ్ళిపోయారు. కృష్ణమూర్తికి ఉరిశిక్ష పడుతుందని కొందరూ, పడదని కొందరూ పందేలు కాసుకున్నారు. 'ఆ గొడవలతో నాకు సంబంధం లేదు' అన్నట్టు కాలం రెండు రోజులు ముందుకు సాగింది.

జడ్జిగారు చాలా ఆలోచించారు. ఆ తీర్పుతో తనకు మంచి పేరు రావాలని ఆయన ఆరాటం. కృష్ణమూర్తిని గురించి ఆయనకేమీ ఆరాటం లేదు.

ఈ రెండు రోజుల వ్యవధిలోనూ ఆయన చాలా పుస్తకాలు తిరగేశారు. ఇటువంటి కేసులలో చాలా మంది జడ్జీలు ఇచ్చిన చాలా తీర్పులను అధ్యయనం చేసుకున్నారు. చివరకు ఆయన తీర్పు ఇచ్చారు.


"ఆత్మహత్యకు మూడుసార్లు ప్రయత్నించిన నేరానికి కృష్ణమూర్తికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించబడింది. ఇన్స్పెక్టర్‌ను చంపిన నేరానికి ఉరి విధించబడినది. మూడు సంవత్సరాల జైలు శిక్ష అనుభవించిన తరవాత ఉరితీయడం అమలుజరుప బడుతుంది.'

తీర్పు విన్న కృష్ణమూర్తి మ్రాన్పడిపోయాడు. కోర్టంతా దద్దరిల్లేలాగా అరిచాడు. "ఇది చాలా అన్యాయం. ఉరి శిక్ష మూడేళ్ళు వాయిదా పడడానికి వీల్లేదు. ఉరి తీశాక జైల్లో వేయండి." అతని మాటలు ఎవరూ పట్టించుకోలేదు. ప్రజలు జడ్జిగారిని మనఃస్ఫూర్తిగా అభినందిస్తూ వెళ్ళిపోయారు.

* * *

జైల్లో కృష్ణమూర్తిని మనోవ్యాధి క్రుంగదీసింది. అతని జీవితంలో ఏ కోరికా కూడా కార్యరూపం ధరించలేదు. ఆఖరికి ఉరిశిక్షకూడా మూడు సంవత్సరాలు వాయిదా పడిందన్న నిజం అతన్ని క్రుంగదీసింది.

ఆ మనోవ్యథతోనే అతను క్షయ వ్యాధికి గురి అయ్యాడు. మూడు నెలలలో క్షయ ముదిరి, ఒక నాటి రాత్రి రక్తం కక్కుకుని చనిపోయాడు. లోకం దృష్టిలో అతి సహజమైన చావు చచ్చాడు. ★



గూడు

చిత్రం— వై. బాలయ్య (సిద్దిపేట)